సాక్షి
రాజన్న సిరిసిల్ల
శనివారం । 18 । నవంబర్ । 2023



రూ.1.20 లక్షలు సీజ్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని జిల్లెల్ల శివారులో గురువారం అర్ధరాత్రి హైదరాబాద్ నుంచి వస్తున్న బస్సులో చేపట్టిన తనిఖీల్లో రూ.1.20లక్షలను సీజ్ చేశారు.



హరికథా గానం

వేములవాడ: రాజన్న సన్నిధిలో శుక్రవారం హరికథాగానం నిర్వహించారు. భూకైలాస్ హరికథను మహామంటపంలో వై.సురేఖ భాగవతారిణిచే వినిపించారు.

గరిష్టం/కనిష్టం
32.0/19.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకం

- ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ జగదీశ్ సోన్‌కర్



మాట్లాడుతున్న సాధారణ పరిశీలకులు

సిరిసిల్ల: ఎన్నికల సమయంలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకమని ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ జగదీశ్ సోన్‌కర్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఎన్నికల విధులు, బాధ్యతలపై సూక్ష్మ పరిశీలకులకు అవగాహన కల్పించారు. పోలింగ్ రోజు నియమావళిని ఎవరైనా అతిక్రమిస్తున్నారా... అనే అంశాలను పరిశీలించాలన్నారు. మాక్ పోల్ నిర్వహణ, ఓటర్ల గుర్తింపు ఓటర్‌కార్డు లేదా ఎన్నికల సంఘం నిర్దేశించిన కార్డుల ప్రకారం కొనసాగుతుందా.. లేదా.. అనే విషయాలను పరిశీలించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే సాధారణ పరిశీలకుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. సూక్ష్మ పరిశీలకుల నివేదికల ఆధారంగానే కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయాలు ఆధారపడి ఉంటాయని స్పష్టం చేశారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో పోటీతత్వం పెంపు



విజేతలను అభినందిస్తున్న అధికారులు

సిరిసిల్లటౌన్: క్రీడలతో విద్యార్థుల్లో పోటీతత్వం అలవడుతుందని జిల్లా క్రీడల అధికారి అజ్మీర రామదాసు పేర్కొన్నారు. రెండు రోజులుగా జిల్లా కేంద్రంలోని మినీస్టేడియంలో జరిగిన ఎస్జీఎఫ్ జిల్లా స్థాయి క్రీడాపోటీల్లో వివిధ మండలాల నుంచి పాల్గొన్న విద్యార్థులు ప్రతిభ చాటారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఎస్జీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేవత ప్రభాకర్ ప్రకటించారు. చెస్, క్యారం, షటిల్ బ్యాడ్మింటన్‌లో 170 మంది విద్యార్థులు పాల్గొనగా.. షటిల్, చెస్, క్యారంలో ఎండీ అంజు, డి.సాహిత్య, మనిక్యష్ణ, ఎస్.కె.షాదుల్, బి.ప్రణయ్, మణిశ్రీ వర్ధన్, బి.సాత్విక, ఎం.డి.అను, సాయిరాం, గణేశ్, సుమేరా, చరణ్‌కుమార్, శ్రీవల్లి, ఎం.డి.ఇమ్రాన్, హర్షిని ఎంపికయ్యారు.

బైండోవర్ ఆశామాషీ కాదు

- డీఎస్పీ నాగేంద్రచారి

వేములవాడరూరల్: సత్ప్రవర్తన కోసం తహసీల్దార్ ముందు బైండోవర్ చేయడాన్ని ఆశామాషీగా తీసుకోవద్దని వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి హెచ్చరించారు. బైండోవర్ అయి మళ్లీ వివాదాలకు తావిస్తున్న ఒకరికి శుక్రవారం జరిమానా విధించినట్లు తెలిపారు. వేములవాడరూరల్ మండలంలోని ఎదురుగట్లకు చెందిన కడారి తిరుపతిని రెండు నెలల క్రితం ఎన్నికల కోడ్ సమయంలో ముందస్తుగా బైండోవర్ చేశామన్నారు. బైండోవర్ కాలపరిమితి ముగియకముందే ఓటర్లను ప్రలోబపెట్టేలా ఎదురుగట్లలో చీరలు పంపిణీ చేయడంతో జరిమానా విధించినట్లు చెప్పారు. బైండోవర్‌లో నిర్ణయించిన షూరిటీ మొత్తం రూ.లక్ష చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరు శాంతిభద్రతల పరిరక్షణలో భాగం కావాలన్నారు.

కార్మికుల సంక్షేమాన్ని మేనిఫెస్టోలో పెట్టాలి



మాట్లాడుతున్న కూరపాటి రమేశ్

సిరిసిల్లటౌన్: పవర్‌లూమ్ కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని తెలంగాణ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేశ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని నెహ్రూనగర్ అంభాభవాని ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం నిర్వహించిన కార్మికుల విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో పవర్‌లూమ్ కార్మికుల సంక్షేమాన్ని పెట్టాలని డిమాండ్ చేశారు. సిరిసిల్లలో బతుకమ్మ చీరల కార్మికులకు యారన్ సబ్సిడీ ఏళ్లుగా ఇవ్వకపోవడాన్ని తప్పుబట్టారు. కార్మికులకు నిరంతరం ఉపాధి కల్పించే 'వర్కర్ టు ఓనర్' పథకాన్ని ప్రారంభించాలని, టెక్స్‌టైల్ పార్కులో మూతబడ్డ పరిశ్రమలను తెరిపించాలని కోరారు. కోడం రమణ, మూశం రమేశ్, మోర అజయ్, ఎలిగేటి రాజశేఖర్, శంకర్, దేవదాసు, లక్ష్మణ్, చంద్రకాంత్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ బీజేపీకి | కర్రుకాల్చి వాత పెట్టున్రి

అభివృద్ధిని వివరిస్తూ.. విపక్షాలపై విమర్శలు చేసిన సీఎం కేసీఆర్

- 'గంగుల' మొండి మనిషి
- కౌశిక్‌కు మెజారిటీ ఇవ్వండి
- బీఆర్‌ఎస్ అభ్యర్థులనే గెలిపించండి
- జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలతో గులాబీ శ్రేణుల్లో జోష్





సాక్షిప్రతినిధి,కరీంనగర్/కరీంనగర్/హుజూరాబాద్/జమ్మికుంట/ఇల్లందకుంట/గంగాధర: రెండో విడత ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం కేసీఆర్ శుక్రవారం కరీంనగర్, చొప్పదండి, హుజూరాబాద్ నియోజకవర్గాల ప్రజాఆశీర్వాద సభల్లో పాల్గొన్నారు. పదేళ్లలో తాము చేసిన అభివృద్ధిని వివరిస్తూ.. విపక్షాలపై విమర్శల వర్షం కురిపించారు. కరీంనగర్‌లోని ఎస్సారార్ కళాశాల మైదానంలో జరిగిన ప్రజా ఆశీర్వాదసభలో సీఎం ప్రసంగం బీఆర్‌ఎస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. ఓ వైపు జిల్లా కేంద్రంలో చేపట్టిన అభివృద్ధి పనులు వివరిస్తూనే మరోవైపు ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో, పదునైన మాటలతో ధ్వజమెత్తారు. 60 ఏళ్లు పరిపాలించిన ప్రతిపక్షాలు చేసిందేమీ లేదని, తాము పదేళ్లలో చేపట్టిన అభివృద్ధి కళ్లముందు పరుగులు పెడుతోందని అన్నారు. బీఆర్‌ఎస్ పుట్టిందే తెలంగాణ ప్రజల కోసమని, అలాంటి పార్టీని జిల్లా ప్రజలు 2001లో జరిగిన సింహగర్జన సభ నుంచి అక్కున చేర్చుకున్నారని గుర్తు చేశారు. రాయేదో.. రత్నమేదో ఆలోచించి బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు కర్రుకాల్చి వాత పెట్టాలని పిలుపునిచ్చారు. మంత్రి గంగుల కమలాకర్ మొండి మనిషి అని ఆయన హయాంలో తీగలవంతెన, మానేరు రివర్ ఫ్రంట్, స్మార్ట్‌సిటీ పనులతో కరీంనగర్ సుందరీకరణ, కూడళ్ల అభివృద్ధి పరుగులు పెడుతోందని కితాబిచ్చారు. హుజూరాబాద్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, చొప్పదండి బీఆర్‌ఎస్ అభ్యర్థి సుంకె రవిశంకర్‌లను భారీ మెజార్టీతో గెలిపించాలని ఈ సందర్భంగా ప్రజలను కోరారు.

34 నిమిషాలు ప్రసంగం...

బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ కరీంనగర్ ఎస్సారార్ కళాశాల మైదానంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో 34 నిమిషాలు ప్రసంగించారు. హెలికాప్టర్ ద్వారా హైదరాబాద్ నుంచి సభాప్రాంగణానికి 1.38 నిమిషాలకు చేరుకున్నారు. తెలంగాణ ప్రగతి రథంలో మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్, మేయర్ వై.సునీల్‌రావు తదితరనేతలతో కలిసి 1.50నిమిషాలకు వేదికపైకి చేరుకున్నారు. మొదటగా కరీంనగర్ బీఆర్‌ఎస్ అసెంబ్లీ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ తన ప్రసంగాన్ని కొనసాగించారు. సీఎం కేసీఆర్ సరిగ్గా 2.02 నిమిషాల నుంచి 2.36 నిమిషాల వరకు మాట్లాడారు. 2001లో సింహగర్జన సభను ఇదే వేదికగా నిర్వహించామని అప్పటి నుంచి ఇప్పటి వరకు అనేక విజయాలు సాధించామని, 50 ఏళ్ల కాంగ్రెస్ దరిద్రపు పాలనకు పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనకు బేరీజు వేసుకుని బాగా ఆలోచించి ఓటు వేయాలని కోరారు. కరీంనగర్‌లో బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో ఎమ్మెల్సీ మధుసూదనచారి, కార్పొరేషన్ చైర్మన్లు సర్దార్ రవీందర్‌సింగ్, కుర్మాచలం అనిల్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్‌కుమార్, మాజీ మంత్రి రాజేశం గౌడ్ బీఆర్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి



కరీంనగర్ నియోజకవర్గంలో రూ.వేలకోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వాటి పరంపర కొనసాగింపునకు మరోసారి ఆశీర్వదించి, గెలిపించండి. గతంలో కరీంనగర్ బొంద లగడ్డగా ఉండేది. పదేళ్లల్లో రూ.వేలకోట్ల పనులతో రూపురేఖలు మారిపోయాయి. సీఎం కేసీఆర్‌కు జిల్లాపై అమితమైన ప్రేమ ఉంది. తెలంగాణ సాధన కోసం జరిగిన తొలి సింహగర్జన బహిరంగసభ నుంచి ఇప్పటి వరకు జిల్లా ప్రజలు కేసీఆర్ వెంటే ఉన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను ఢిల్లీ పాలకుల చేతుల్లో పెట్టొద్దు. జిల్లా ప్రజలు అభివృద్ధి వైపో.. విధ్వంసం వైపో తేల్చుకుని ఓటు వేయండి. – గంగుల కమలాకర్, కరీంనగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి



రూ.వెయ్యి కోట్ల నిధులు తెస్తా

ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశం ఇవ్వండి. కేసీఆర్ కాళ్లు పట్టుకోనైనా హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి రూ.వెయ్యి కోట్ల నిధులు తెస్తా. ఉప్పల్, చల్లూరు, వావిలాల మండలాల ఏర్పాటుకు కృషి చేస్తా. ఇక్కడ గెలిచిన ఎమ్మెల్యే ప్రజలకు వెన్నుపోటు పొడిచి గజ్వేల్‌లో పోటీ చేస్తుండు. 15 ఏళ్లుగా ప్రజాసేవలోనే ఉన్నా. ఒక్కసారి అవకాశం ఇవ్వండి . అభివృద్ధి చేసి చూపిస్తా.
– పాడి కౌశిక్‌రెడ్డి, హుజూరాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి

కుక్కలు చింపిన విస్తరి అవుతుంది



తెలంగాణ తెచ్చాం. 24 గంటల కరెంట్ ఇస్తున్నాం. గోదావరి జలాలతో కోటి ఎకరాలకు సాగునీరు అందించి చూపిస్తున్నాం. అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో ఉంది. వందేళ్ల వరకు ప్రగతి పరుగులు పెట్టే విధంగా ప్రణాళికలున్నాయి. కాంగ్రెస్, బీజేపీ పార్టీలను నమ్మితే తెలంగాణను కుక్కలు చింపిన విస్తరిలా చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. కేసీఆర్‌కు అండగా గులాబీ జెండా ఉంది. మంత్రి గంగులను భారీ మెజార్టీతో గెలిపించాలి.
– బోయిన్‌పల్లి వినోద్‌కుమార్, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు

కొంగుపట్టి కోరుతున్నా

హుజూరాబాద్ నియోజకవర్గంలో 15 ఏళ్ల నుంచి ప్రజా సేవలోనే ఉన్నాం. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని గడప గడపకు చేరవేస్తున్నాం.కొంగు పట్టి కోరుతున్నా కౌశిక్‌రెడ్డికి ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశం ఇవ్వండి. హుజూరాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి ఆయన వెంటే నేను ఉంటా. – శాలిని, పాడి కౌశిక్‌రెడ్డి భార్య



సీఎం కేసీఆర్‌కు బొట్టు పెడుతున్న పాడికౌశిక్ కూతురు శ్రీనిక

డాడీకి ఒక్క చాన్స్ ఇవ్వండి

హుజూరాబాద్ నియోజకవర్గాన్ని హైదరాబాద్‌లా అభివృద్ధి చేయాలన్నదే మా డాడీ కళ. మీ అందరికీ దండంపెట్టి కోరుతున్నా. డాడీకి ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశం ఇవ్వండి. డాడీ వెంట పడి హుజూరాబాద్ అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు నిధులు తెచ్చేలా చేస్తా.
– శ్రీనిక, కౌశిక్‌రెడ్డి కూతురు



కేసీఆర్‌కు గద అందిస్తున్న సునీల్‌రావు

'కట్టప్ప'లతో కలవరం!

- అన్ని పార్టీల్లో నేతలకు కోవర్టుల భయం
- వ్యూహాలు ప్రత్యర్థులకు చేరవేతలు
- ఎన్నికలు సమీపిస్తుండటంతో జోరుగా ఫిరాయింపులు
- రహస్య ఆపరేషన్స్‌కు కొత్తగా చేరిన వారిని దూరం పెడుతున్న నేతలు



- ఉమ్మడి జిల్లాలోని ఓ నియోజకవర్గానికి చెందిన అధికార పార్టీ కౌన్సిలర్ ఒకరు పార్టీ మారుతున్నడనే సమాచారం కోవర్టుల ద్వారా తెలుసుకున్న సదరు నేత వెంటనే అప్రమత్తమై ఆ కౌన్సిలర్ పార్టీ మారకుండా బుజ్జగించాడు.
- ఒక ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్నికల ఖర్చు కోసం కొంత డబ్బును రహస్యంగా కారులో హైదరాబాద్ నుంచి తన నియోజకవర్గానికి తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడింది. కోవర్టుతోనే సమాచారం లీకై నగదు పట్టుపడినట్లు ఆ పార్టీలో గుసగుసలు వినిపిస్తున్నాయి.
- మరోనియోజకవర్గ నేత తన సెగ్మెంట్ పరిధిలో దసరా కానుకగా డీజే సౌండ్ బాక్స్‌లు పంచిపెట్టాలనుకున్నారు. అలాగే తన పేరుతో గోడ గడియారాలు పంచిపెట్టాదానికి లారీలో తరలిస్తుండగా పట్టుబడింది. ప్రత్యర్థుల పార్టీల్లోకి కోవర్టులను పంపి వారి సమాచారం సేకరించే సదరు నేతకు ఈసారి కోవర్టులతో రివర్స్ షాక్‌లు కొడుతున్నాయి. దీంతో ఎవరిని నమ్మాల్నో.. ఎవరికి ఏంచెప్పాల్నో అర్థమైతలేదని వాపోతున్నాడు.

సాక్షి, పెద్దపల్లి: ఉమ్మడి కరీంనగర్ జిల్లావ్యాప్తంగా అన్ని పార్టీల్లో ఫిరాయింపులు జోరుగా సాగుతున్నాయి. దీంతో కొత్తగా వచ్చిచేరిన నేతలు లేదా పార్టీ మారకుండా అసంతృప్తిగా ఉన్న ఇంటిదొంగలు తమ వ్యూహాలు లీక్ చేస్తున్నారేమోనని పలువురు నేతలు సతమతమవుతున్నారు. సొంత శిబిరంలోని ఇలాంటి ×కట్టప్పలని పట్టుకోవడం ఎట్లా అని? వారు తలలు పట్టుకుంటున్నారు.

నేతలకు కోవర్టుల టెన్షన్..

- పోలింగ్ గడువు సమీపిస్తున్న కొద్దీ కొందరి నేతలకు కోవర్టుల టెన్షన్ పెరిగిపోతోంది.
- ఎన్నికల్లో విజయం సాధించాలంటే తాము ఎలాంటి వ్యూహాలు అమలు చేస్తున్నామనేది ఎంతముఖ్యమో.. ప్రతిపక్ష పార్టీ నేతలు వేసే ఎత్తుగడలను ముందే పసిగట్టడం అంతే ముఖ్యంగా భావిస్తున్న నేతలు.. కోవర్టు అస్త్రాలు సంధిస్తున్నారు.
- ప్రత్యర్థి పార్టీల నేతలను తమ పార్టీలోకి లాక్కోవడంతోపాటు, తమ పార్టీలోని నేతలు ప్రత్యర్థి గూటికి చేరకుండా చూసుకోవడం ఇప్పుడు కత్తిమీద సాములా మారింది.
- దీంతో ప్రత్యర్థి పార్టీల్లో తమ అనుచరులను ఉంచేలా చూసుకుంటున్నారు.
- దానికోసం భారీగా ఆర్థిక సాయం అందించటంతోపాటు, ఎన్నికల అనంతరం పదవుల హామీతో ప్రత్యర్థి శిబిరంలోకి పంపుతున్నారు.
- ప్రజల నాడీ తెలియక తికమకపడుతున్నా నేతలకు, పార్టీలో మనస్ఫూర్తిగా పనిచేస్తున్న వారు ఎవరో, కట్టప్పలు ఎవరో తెలియక ఆందోళన చెందుతున్నారు.
- ఫిరాయింపు నేతలతోపాటు సొంతపార్టీల్లోని అసమ్మతి నేతలను సైతం అనుమానిస్తూ, ఎవరిని నమ్మాలో తెలియక టెన్షన్ పడుతున్నారు.

గతంలో చేదు అనుభవాలతో..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చాలానియోజకవర్గాల్లో 2018 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులే మళ్లీ ఎన్నికల బరిలో తలపడుతున్నారు. తాయిలాలు, డబ్బు, పార్టీలో చేరికలు తదితర అంశాలను కోవర్టులు లీక్ చేయటంతోనే గతంలో తీవ్రంగా నష్టపోయారు. ఈసారి ఎన్నికల్లో కీలకమైన ఆర్థిక వ్యవహారాలు, పార్టీ ఫండ్ తదితర వివరాలను పార్టీ నేతలకు కాకుండా తమ బంధువులు, కుటుంబ సభ్యులే చూసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఓటర్లకు ఇచ్చే నజరానాలు, ఫండింగ్ ఇస్తున్నదెవరు? అనే అంశాలను తమ అనుచరులకు తెలియకుండా జాగ్రత్తపడుతున్నారు. పార్టీ నేతలు, కీలక నేతలను కేవలం ప్రచారంలో అనుసరించాల్సిన వ్యూహాల ఖరారు చేయడానికే పరిమితం చేస్తున్నారు. దీంతో కొందరు కార్యకర్తలు నొచ్చుకుంటున్నారు. అయినా, ఒక్కోసారి ఎంత జాగ్రత్త పడినా రాత్రి అనుకున్న విషయాలు తెల్లారేలోగా పక్క పార్టీలకు చేరుతున్నాయి. ఇలా లీకేజీలకు పాల్పడుతున్న కోవర్టులు అన్ని పార్టీలకు దడపుట్టిస్తూ తలనొప్పిగా మారుతున్నారు.

ఖర్చుల నమోదులో తేడాలు రావొద్దు

- ఎన్నికల వ్యయ పరిశీలకుడు మణిగండసామి
- మొదటి తనిఖీలకు రాని అభ్యర్థులకు నోటీసులు



మాట్లాడుతున్న వ్యయ పరిశీలకులు

సిరిసిల్ల: ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చుల నమోదులో తేడాలు లేకుండా చూసుకోవాలని ఎన్నికల వ్యయ పరిశీలకులు జి.మణిగండసామి సూచించారు. సిరిసిల్ల, వేములవాడ రిటర్నింగ్ అధికారి ఆఫీస్‌లో శుక్రవారం అభ్యర్థుల రోజువారీ అకౌంట్ల మొదటి తనిఖీని చేపట్టారు. అకౌంట్ పుస్తకాలు, ఓచర్లు, బిల్లులను పరిశీలించారు. క్రిమినల్ ఆంటిసిడెంట్స్, సీ విజిల్, సువిధ, ఎంసీఎంసీ అంశాల గురించి వివరించారు. ఈ సందర్భంగా అభ్యర్థులు, వారి ఏజెంట్లు అడిగిన సందేహాలను వ్యయ పరిశీలకులు నివృత్తి చేశారు. మొదటి తనిఖీకి రానివారికి 24 గంటల్లోగా నోటీసులు జారీ చేయాలని రిటర్నింగ్ అధికారులకు సూచించారు. రిటర్నింగ్ అధికారులు ఆనంద్‌కుమార్, మధుసూదన్, జిల్లా వ్యయ పర్యవేక్షణ కమిటీ ప్రత్యేక అధికారి స్వప్న, నోడల్ అధికారి రామకృష్ణ, జిల్లా పౌరసంబంధాల అధికారి మామిండ్ల దశరథం, జిల్లా లేబర్ అధికారి రఫీ, చేనేత జౌళి శాఖ జిల్లా అధికారి సాగర్, లైజన్ అధికారి నర్సింహులు ఉన్నారు.

రహస్య విధానంలోనే ఇంటి వద్ద ఓటింగ్

- 21 నుంచి 25 వరకు అవకాశం
- కలెక్టర్ అనురాగ్ జయంతి



పోలింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

సిరిసిల్ల: ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఇంటి వద్ద ఓటింగ్‌ను రహస్య విధానంలో నిర్వహించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఎన్నికల సిబ్బందికి శిక్షణనిచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 80 ఏళ్ల పైబడిన వృద్ధులు, 40 శాతానికి పైగా వైకల్యం ఉన్న వారికి ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల సంఘం తొలిసారి కల్పించిందని తెలిపారు. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల్లో ఈనెల 21 నుంచి 25వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో పోలింగ్ జరుగుతుందని వివరించారు. ఒక్కో బృందంలో పోలింగ్ అధికారి, అదనపు పోలింగ్ అధికారి, మైక్రో అబ్జర్వర్, పోలీస్ సిబ్బంది, వీడియోగ్రాఫర్ ఉంటారని తెలిపారు. పోటీలో ఉన్న అభ్యర్థులు లేదా వారి ఏజెంట్లను నిర్ణీత పద్ధతి ప్రకారం అనుమతిస్తారన్నారు. పోలింగ్ కేంద్రంలో చేసిన మాదిరే ఓటింగ్ ప్రక్రియను వీడియోగ్రఫీ చేయాలని సూచించారు. అధికారిక వాహనంలోనే వెళ్లి హోం ఓటింగ్ విధులు నిర్వర్తించాలన్నారు.

ఎన్నికల విధుల్లో ఉన్న వారికి..

ఎన్నికల విధుల్లో ఉండి ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని సిబ్బందికి జిల్లా కేంద్రంలోని గీతానగర్ జెడ్పీ హైస్కూల్, వేములవాడ నియోజకవర్గానికి సంబంధించి అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫెసిలిటేషన్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈనెల 21, 22, 25 తేదీలలో ట్రైనింగ్ జరిగే వేదికల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. అత్యవసర సేవల సిబ్బందికి ఈనెల 25న రిటర్నింగ్ అధికారి కార్యాలయాలలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్‌కు అవకాశం కల్పిస్తున్నట్లు వివరించారు. అంతకుముందు మాస్టర్ ట్రైనర్ శ్రీనివాసరెడ్డి పీవోలు, ఓపీవోలు, మైక్రో అబ్జర్వర్లకు శిక్షణనిచ్చారు. పోస్టల్ బ్యాలెట్ జిల్లా నోడల్ అధికారి పి.లక్ష్మీరాజం, సీపీవో పి.బి.శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ కేంద్రాలు పరిశీలన

పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బంది శిక్షణకు ఎంపిక చేసిన కేంద్రాలను కలెక్టర్ అనురాగ్ జయంతి శుక్రవారం పరిశీలించారు. వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శిక్షణ ఇవ్వనున్నారు. సిరిసిల్ల నియోజకవర్గానికి సంబంధించి జిల్లా కేంద్రంలోని గీతానగర్ జెడ్పీ హైస్కూల్‌లో శిక్షణ ఉంటుంది. అనంతరం సిరిసిల్ల తహసీల్దార్ ఆఫీస్‌లో కలెక్టర్ సమీక్షించారు. రిటర్నింగ్ అధికారులు ఆనంద్‌కుమార్, మధుసూదన్, శిక్షణ కార్యక్రమాల నోడల్ అధికారి పీబీ శ్రీనివాసాచారి ఉన్నారు.

సమస్యాత్మక గ్రామాలపై దృష్టి

- ఓటర్లకు భద్రత భావాన్ని కల్పించాలి
- ఎస్పీ అఖిల్ మహాజన్



ముస్తాబాద్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ

ముస్తాబాద్(సిరిసిల్ల): జిల్లాలో సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. సమస్యాత్మక గ్రామాలు ముస్తాబాద్, బందనకల్, గూడెం, పోతుగల్, నామాపూర్ పోలింగ్ కేంద్రాలను శుక్రవారం సందర్శించారు. పోలింగ్ కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ ఓటర్లకు భద్రత భావాన్ని పోలీసులు కల్పించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ పోలీసు సిబ్బంది, అధికారులు అలసత్వాన్ని ప్రదర్శించొద్దని సూచించారు. సమస్యాత్మక గ్రామాల్లో తరచూ సందర్శించాలని, ఫ్లాగ్‌మార్చ్ చేయాలని ఆదేశించారు. ఎన్నికల పోలింగ్ దగ్గర పడుతున్న నేపథ్యంలో పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా సరిహద్దులోని చెక్‌పోస్టును సందర్శించి, రిజిష్టర్లను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడారు. డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, ఎస్సై శేఖర్‌రెడ్డి, ఆర్‌ఐ శ్యామ్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



సంఘటన స్థలంలో రాములు

చందుర్తి(వేములవాడ): మండలంలోని ఎన్గల్, మర్రిగడ్డ గ్రామాల మధ్య బైక్ అదుపుతప్పి ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని మల్యాలకు చెందిన నీలి రాములు(55) ఎన్గల్ గ్రామానికి బైక్‌పై వెళ్లి తిరిగివస్తుండగా ఎన్గల్–మర్రిగడ్డ గ్రామాల మధ్య గల కల్వర్టు వద్ద రోడ్డుపై పెద్ద గుంతను గమనించపోవడంతో అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ సంఘటనలో రాములు తలకు బలమైన గాయమై, అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన చుట్టుపక్కల చేలలోని రైతులు వెంటనే క్షతగాత్రున్ని 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- బొప్పాపూర్‌లో విషాదం
- మేడ్చల్‌లో ఘటన



అజీజ్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మేడ్చల్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో బొప్పాపూర్‌కు చెందిన యువకుడు అజీజ్ దుర్మరణం చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. జీవనోపాధి కోసం అజీజ్ ఆటో నడుపుతుండేవాడు. శుక్రవారం తెల్లవారుజామున ఆటోలో వెళ్తుండగా అతివేగంగా వచ్చిన ఇసుక టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అజీజ్ అక్కడికక్కడే మృతిచెందాడు. అజీజ్ మృతితో బొప్పాపూర్‌లో విషాదం అలుముకుంది.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య



శ్రీనివాస్(ఫైల్)

సిరిసిల్లటౌన్: అప్పుల బాధతో పెయింటింగ్ కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సిరిసిల్లలో చోటుచేసుకుంది. బంధువులు తెలిపిన వివరాలు. స్థానిక అంబేద్కర్ నగర్‌కు చెందిన నక్క శ్రీనివాస్(40) పెయింటింగ్ కార్మికుడిగా పనిచేస్తూ.. భార్య లావణ్య, కొడుకులు టింకు(11), టోని(10)లతో ఉంటున్నాడు. ఇంట్లో బాధ్యతలు పెరగడం, అనారోగ్యంతో రూ.5లక్షలు అప్పులయ్యాయి. అప్పులు తీర్చేందుకు సంపాదన సరిపోకపోవడంతో మనస్థాపానికి గురై గురువారం ఇంట్లోనే గడ్డిమందును తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ శుక్రవారం చనిపోయాడు. చేతిలో చిల్లిగవ్వలేకపోవడంతో కుటుంబ సభ్యులు మృతదేహాన్ని ఇంటికి తీసుకురాలేని నిస్సాహాయ స్థితిలో ఉన్నారు. దాతలు 97045 46180లో గూగుల్‌పేలో సాయం చేయాలని కోరుతున్నారు.

నమ్మకమైన వ్యవ'సాయం' కావాలి



- రైతుశ్రమను గుర్తించాలి
- శ్రమకు తగిన ఫలితం ఉండాలి
- రైతులవారీగా పంటలబీమాను అమలు చేయాలి
- ఇది రైతుల ఎజెండా

సాక్షి పీపుల్స్ ఎజెండా

సిరిసిల్ల: ఆరుగాలం శ్రమించే అన్నదాతలకు నమ్మకమైన ఆదాయం కరువైంది. ఛీడపీడలు, ప్రకృతి వైపరీత్యాలు.. వన్యప్రాణుల సమస్య, విద్యుత్ సమస్యలు, సాగునీటి ఇబ్బందులు వెరసి వేసిన పంట చేతికి అందే వరకు దిగులే. వ్యవసాయ ఆధారిత దేశంలో అన్నదాతలకు సాయం గాలిలో దీపమవుతుంది. ఏటా పెరుగుతున్న పెట్టుబడులు.. అంతకంతకు దిగజారుతున్న గిట్టుబాటు ధరలు.. మద్దతు ఇవ్వని సర్కారు కనీస ధరలతో రైతు నేడు మార్కెట్‌లో అంగడి సరుకై నిల్చున్నాడు. దళారులు రాజ్యంలో 'సిండికేట్' దందాతో రైతు బలిపశువు అవుతున్నాడు. 'అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి'లా అన్నదాతల పరిస్థితి మారింది. రైతులకు సర్కారు ఏం చేయాలి.. ఏం చేస్తే.. సగటు రైతుకు వ్యవ'సాయం' దక్కుతుంది.. అని జిల్లా నలుమూలల్లోని రైతులను 'సాక్షి' పలకరిస్తే.. అన్నదాతలు వెలిబుచ్చిన అభిప్రాయాలు.. వారి మాటల్లోనే...

రైతులే ధర నిర్ణయించాలి



ఏటా ప్రభుత్వం నిర్ణయించే ధరలు రైతుల శ్రమకు గిట్టుబాటు కావడం లేదు. నిజంగా రైతుల శ్రమను లెక్కిస్తే.. ఏమీ మిగలదు. ఏ పంటకైనా రైతులు గిట్టుబాటు ధరలను నిర్ణయించుకునే పరిస్థితులు ఉండాలి. ప్రభుత్వం కూడా శాస్త్రీయంగా విశ్లేషించి రైతుల శ్రమను లెక్కించి కనీస మద్దతు ధరను నిర్ణయించాలి.

– కోట లింగం, గంభీరావుపేట

పంటలకు బోనస్ ఇవ్వాలి



ప్రభుత్వాలు ఏవి మారినా రైతన్నకు సరైన న్యాయం జరగడం లేదు. పంటకు అయిన పెట్టుబడిని అంచనా వేసి ప్రతీ సీజన్‌లో బోనస్ ఇవ్వాలి. పంటల సాగుకు ముందే మద్దతు ధర ప్రకటిస్తే ఏ పంట వేసుకోవాలో నిర్ణయించుకుంటారు. ప్రభుత్వ నిర్ణయాలతో ఏటా శ్రమ దోపిడీకి గురవుతున్నారు.

– దానె కొమురయ్య, అచ్చన్నపల్లి

ఎరువులు ఉచితంగా ఇవ్వాలి



నాకు ఎకరం పొలం ఉంది. పెట్టుబడులు బాగా పెరిగినయి. రైతుబంధు వచ్చినా ఏ మూలకు సరిపోతలేవు. డీజిల్ ధర పెరగడంతో ట్రాక్టర్ వాళ్ల ధరలు పెంచారు. ప్రభుత్వం ప్రకటించే గిట్టుబాటు ధర సరిపోవడం లేదు. ఉచితంగా ఎరువులు అందిస్తే బాగుంటది.

– బట్టు ఆనంద్, మద్దిమల్ల

ఐదెకరాలకే పరిమితం చేయాలి



నాకు మూడెకరాలు ఉంది. చాలా మంది చిన్న, సన్నకారు రైతులకు ఐదెకరాలు ఉంది. ప్రభుత్వం ఇచ్చే రైతుబంధు ఐదెకరాలకే పరిమితం చేయాలి. పెద్ద రైతులకు ఇచ్చి, మాక్కూడా ఇస్తే రైతుల మధ్య అంతరం ఎలా పోతుంది. ఎరువుల బస్తాలపై సబ్సిడీ పెంచాలి. రైతుల వారీగా పంటలబీమా పథకాన్ని అమలు చేయాలి. పంటల సాగుపై అవగాహన కల్పించాలి.

– కొండవేని పర్శరాములు, బోయినపల్లి

ఉపాధిహామీని అనుసంధానించాలి



కూలీల కొరత రైతులకు పెద్ద సమస్య. ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయంతో అనుసంధానిస్తే రైతులపై ఆర్థిక భారం తగ్గుతుంది. గతంలో మాదిరిగా సబ్సిడీపై పనిముట్లను అందించాలి. పంటబీమాను అమలు చేయాలి. రైతులు పండించే పంటలకు సరైన గిట్టుబాటు ధర కల్పించాలి.

– దేశవేని శ్రీనివాస్, రుద్రంగి

రైతులకు ఏమిచ్చినా తక్కువే..



రైతులకు ఏమిచ్చినా తక్కువే. పంటలు పండిస్తే షావుకారులు చెప్పిన ధరలకే అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. మార్కెట్‌లో దళారులు సిండికేట్ అయితే.. ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. పంటకు బోనస్ అందించాలి. పంటలు సాగుచేసే భూములకే రైతుబంధు ఇవ్వాలి. బీడు భూములకు ఇవ్వద్దు.

– కదిరె లచ్చిరెడ్డి, పల్లిమక్త, కోనరావుపేట

పాత కమిటీతోనే బ్రహ్మోత్సవాలు

- కుల సంఘాల ఏకగ్రీవ తీర్మానం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలోని సుప్రసిద్ధ శ్రీవేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను ప్రస్తుత పాత కమిటీ ఆధ్వర్యంలోనే కొనసాగించాలని గ్రామ కులసంఘాలు ఏకగ్రీవంగా తీర్మానించాయి. ఆలయ కమిటీ చైర్మన్ నంది కిషన్ ఆధ్వర్యంలో పాలకవర్గం పనిచేస్తుండగా.. మరో పాలకవర్గాన్ని ఇటీవల సర్పంచ్ వెంకట్‌రెడ్డి ఏర్పాటు చేశారు. దీనిపై గ్రామంలోని పలు కుల సంఘాలు శుక్రవారం ఆలయ ఆవరణలో సమావేశమై ప్రస్తుత కమిటీ చైర్మన్ నంది కిషన్ ఆధ్వర్యంలోనే బ్రహ్మోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించాయి. ఈ నేపథ్యంలోనే సర్పంచ్ నూతన పాలకవర్గాన్ని ఏర్పాటు చేయడం పలు విమర్శలకు దారితీసింది. ఈ పరిణామాల క్రమంలో నంది కిషన్ పార్టీ మారుతున్నట్లు ఊహాగానాలు జోరందుకున్నాయి. ఈ నేపథ్యంలో నంది కిషన్ విలేకరులతో మాట్లాడుతూ పార్టీ మారేది లేదని.. బతికున్నంత కాలం దేవునికి సేవ చేస్తానని ప్రకటించారు. దీంతో నూతన కమిటీ సభ్యులు, ప్రస్తుత పాలకవర్గ సభ్యుల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి.



సమావేశమైన ఆలయ కమిటీ సభ్యులు

'వైభవంగా వేడుకలు నిర్వహిస్తాం'

మండల కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని పంచాయతీ పాలకవర్గం, ఇటీవల ఏర్పాటు చేసిన ఆలయ నూతన పాలకవర్గం నిర్ణయించాయి. నూతన కమిటీ చైర్మన్ గడ్డం జితేందర్, వైస్‌చైర్మన్ గంట వెంకటేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్ణయం తీసుకున్నారు. ఈమేరకు గ్రామపంచాయతీ ఆఫీస్‌లో శుక్రవారం గ్రామపెద్దలు, యువకులు దాదాపు వంద మందికి పైగా పాల్గొన్నారు.



జీపీలో సమావేశమైన గ్రామస్తులు, పంచాయతీ పాలకవర్గం సభ్యులు





సిరిసిల్లలో ఎన్నికల ప్రచార పోస్టర్లను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ప్రచార పోస్టర్ల తొలగింపు

సిరిసిల్ల: ఎన్నికల ప్రచార పోస్టర్లను మున్సిపల్ సిబ్బంది శుక్రవారం తొలగించారు. జిల్లా కేంద్రంలోని వెంకంపేట, పద్మనగర్ ప్రాంతాల్లో అనుమతులు లేకుండా ఎన్నికల ప్రచార పోస్టర్లను ఆయా పార్టీల నాయకులు అతికించారు. దీనిపై ఫిర్యాదులు రావడంతో మున్సిపల్ సిబ్బంది క్షేత్రస్థాయిలో అంటించిన అన్ని పార్టీల ప్రచార వాల్‌పోస్టర్లను తొలగించారు.

రోడ్డు ప్రమాదంలో జీపీ ట్రాక్టర్ డ్రైవర్‌కు గాయాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న రేసు కిషన్ శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు. స్థానిక పాత బస్టాండ్‌లో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొట్టుకోగా, ఓ బైక్‌పై ప్రయాణిస్తున్న కిషన్ అదుపుతప్పి కింద పడడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కిషన్‌ను సర్పంచ్ నేవూరి వెంకట్‌రెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.



గాయపడ్డ కిషన్

యువతి ఆత్మహత్య

- చికిత్స పొందుతూ మృతి
- నర్సింగాపూర్‌లో విషాదం

చందుర్తి(వేములవాడ): పురుగుల మందు తాగి ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మండలంలోని నర్సింగాపూర్‌లో విషాదం నింపింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు. మండలంలోని నర్సింగాపూర్‌కు చెందిన నేరెళ్ల రేణుక(25) కరీంనగర్ జిల్లా గంగాధరలో డాక్యుమెంట్ రైటర్‌గా పనిచేస్తుంది. గురువారం మధ్యాహ్నం పురుగుల మందు తాగగా.. కరీంనగర్‌కు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో జిల్లాలోని ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతిచెందింది. యువతి ఆత్మహత్యకు కడుపునొప్పి కారణమని స్థానికులు భావిస్తున్నారు. ఆస్పత్రి నుంచి మృతదేహాన్ని స్వగ్రామం నర్సింగాపూర్‌కు తీసుకొచ్చారు.



నేరెళ్ల రేణుక(ఫైల్)

భద్రత మాది... బాధ్యత మీది

- ఓటు హక్కును వినియోగించుకోవాలి
- సిరిసిల్లలో ఫ్లాగ్ మార్చ్

సిరిసిల్లక్రైం: ప్రజలు నిర్భయంగా ఓటు వేసేందుకు భద్రత కల్పిస్తామని ఓటును సద్వినియోగం చేసుకునే బాధ్యతను ఓటర్లు తీసుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ కోరారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం కేంద్ర సాయుధ బలగాలతోపాటు జిల్లా పోలీసులతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. సిరిసిల్లటౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి ప్రారంభమైన ఫ్లాగ్‌మార్చ్ గీతానగర్, విద్యానగర్, అంబేద్కర్‌నగర్, శాంతినగర్, రాళ్లబావి, పెద్దబజార్, కొత్తబస్టాండ్ వరకు కొనసాగింది. ఎస్పీ మాట్లాడుతూ ఈనెల 30 న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలందరూ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. ప్రజల్లో ఆత్మస్థైర్యాన్ని నింపేందుకు ఫ్లాగ్‌మార్చ్‌లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోషల్ మీడియా వేదికగా అల్లర్లు సృష్టించే విధానాలు అవలంబిస్తే గ్రూప్ అడ్మిన్‌లతోపాటు పోస్టులు పెట్టిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, సీఐ ఉపేందర్, కేంద్ర సాయుధ బలగాలు పాల్గొన్నారు.



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న సాయుధ బలగాలు

పది రోజుల్లోనే మారిన జెండాలు

వేములవాడరూరల్: ఎన్నికల సిత్రాలు చూసేందుకు రెండు కళ్లు చాలవు అన్నట్లు ఉన్నాయి వేములవాడలో పార్టీ ఫిరాయింపుదారుల వ్యవహారం. పార్టీ ఫిరాయింపులు వెనుక పెద్ద ఎత్తున బేరసారాలు జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని కోనాయపల్లి 13వ వార్డు కౌన్సిలర్ గడ్డమీది లావణ్య పది రోజుల్లోనే రెండు పార్టీల జెండాలు మార్చారు. బీజేపీపై గెలుపొందిన లావణ్య ఈనెల 8న బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. పది రోజులు గడవకముందే శుక్రవారం బీజేపీ అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు సమక్షంలో ఆ పార్టీలో చేరారు.





బీఆర్‌ఎస్‌లో చేరుతూ.. బీజేపీ జెండా కప్పుకుంటూ..

రాజన్నకు కార్తీక శోభ



కోడెమొక్కు చెల్లించుకుంటున్న భక్తులు




రాజన్న ఆలయ ఆవరణలో భక్తులు



దీపాలు వెలిగిస్తున్న మహిళలు

వేములవాడ: రాజన్నకు కార్తీకశోభ సంతరించుకుంది. శుక్రవారం వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు 10 వేల మంది తరలివచ్చి రాజన్నకు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అనుబంధ ఆలయాలను సందర్శించారు. కార్తీకమాసం పురస్కరించుకుని మహిళలు, కుటుంబ సభ్యులతో కలసి కార్తీక దీపాలను వెలిగించారు.









తొలిపొద్దు.. ఆరోగ్యమే హద్దు

తెలవారకముందే పట్టణవాసులు మానేరుతీరం బాట పడుతున్నారు. మంచుతెరలు తొలగిపోకముందే ఆరోగ్య రక్షణ కోసం వాకింగ్, రన్నింగ్ చేస్తున్నారు. స్థానిక బతుకమ్మ ఘాట్ వద్ద ఉదయమే చాలా మంది చేరుకొని ఎక్సర్‌సైజ్‌లు చేస్తూ కనిపిస్తుంటారు. మానేరులోని బ్యాక్‌వాటర్‌కు భానుడి కిరణాలు తోడై బంగారువర్ణంలో మెరుస్తూ చూపరులను ఆకట్టుకుంటుంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధ్యక్షుడిగా విష్ణుప్రసాద్



నీరటి విష్ణుప్రసాద్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రసాయన శాస్త్రం అధ్యాపకులుగా పనిచేస్తున్న నీరటి విష్ణుప్రసాద్ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విష్ణుప్రసాద్ మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు బరిగల నారాయణకు కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

కరీంనగర్ కొత్త యాస్వాడ హరిహరనగర్, రోడ్ నెంబర్ 2 లెఫ్ట్ సైడ్ ల్యాండ్ ఏరియా 64X34 ఉత్తరం ఫేసింగ్ మెయిన్ డోర్, 30Ft వెడల్పు రోడ్డు గల ఇల్లు అమ్మకమునకు కలదు. సెల్: 98480 34208 [K-1185869]

SERVICES

OLD AGE HOME

ఒమేగా హోంకేర్ వంట/ఇంటి పనిచేయుటకు, వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను 24 గం॥లు చూసుకొనుటకు మీ ఇంటికే కేర్‌టేకర్స్‌ని పంపబడును. హైదరాబాద్. Ph: 8977639664/ 8977639665 [H-793653]

WANTED

REQUIRED CIVIL CONTRACTORS IRP Infra Tech Pvt Ltd, a leading telecom infrastructure company, is looking for CIVIL CONTRACTORS to execute Civil Foundation works for Telecom Towers and Solar Structures in various parts of Andhra Pradesh. Interested contractors can apply by E-mail to: civilirp23@gmail.com or contact us at: 79812 72969 91604 42234 [OA 297]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824